# హరి దాసులు

"హరిదాసులు" అనగా చాతాది వైష్ణవులు. వీరు హరికేదాసులుగాని సిరికి దాసులుకాదు. వీరు తలపై అక్షయపాత్ర ధరించి పట్టుపీతాంబరాలు ధరించి, మెడలో పూలమాల ధరించి, వైష్ణవాచార ప్రకారం పన్నెండు నామాలు ధరించి, కాళ్లకు గజ్జెలుకట్టి ఎడమచేతితో చిరుతలు వాయిస్తూ, కుడిభుజంపై సితార మీటుతూ రాగ, తాళ, భావ, నృత్యం సంయుక్తంగా రామదాసుకీర్తనలు, త్యాగరాజస్వామి కీర్తనలు, హరికీర్తనలు, అన్నమాచార్య కీర్తనలు గానంచేస్తూ "ధనుర్మాసం"లో అనగా నెలగంట పెట్టినది మొదలు సంక్రాంతి మూడవరోజు వరకు గ్రామాలలో వీధి వీధినా, ఇంటింటా వినిపిస్తూ తాను తరిస్తూ ప్రజలను తరిపంచేస్తూ "భిక్ష" పెట్టినచో "జై శ్రీమద్రమారమణగోవిందో హరి:" అంటూ నామాన్ని వినిపిస్తూ గ్రామాన్ని తరింపచేస్తూ వుంటారు. తాళం వాయించే శిష్యుణ్ణి వెంటపెట్టుకొని తిరుగుతూ వుంటారు.



ఇలా హరిదాసులు గ్రామాలలో తిరుగుటకు కారణం - పూర్వకాలంలో శ్రీ మహావిష్ణువు వామనమూర్తిగా అవతరించి బలిచక్రవర్తిని పాతాళలోకానికి త్రొక్కుతూ ఓ బలిచక్రవర్తీ - నీకు ఏంవరం కావాలో కోరుకో అన్నారు. అప్పుడు బలిచక్రవర్తి ఓ మహానుభావా ఈ లోకంలో సూర్య చంద్రాదులు వున్నంతవరకూ నేను చేసిన ధర్మం నిలవాలి, ప్రజలందరూ లేదు అనకుండా దానం చేయాలి అని కోరుకున్నాడు. బలిచక్రవర్తితో దానికి వామనమూర్తి నాయనా బలిచక్రవర్తి, కాలానుగుణంగా, ధర్మం మారుతుంటుంది. అందుచేత కలియుగంలో ఒక నెలరోజులు నేనే హరిదాసురూపంలో, గ్రామాలలో సంకీర్తనం చేస్తూ ప్రజలను తరింపచేస్తూ వుంటాను. అప్పుడు ప్రజలు లేదు అనకుండగా ఈ నెలరోజులూ "భిక్ష" పెడుతూవుంటారు. ఆ భిక్షను దైవకార్యాలకు వినియోగిస్తే అప్పుడు నీవు కోరిన విధంగా దానంబు ఆచంద్రతారార్కమూ భూమిపై

నిలుస్తుంది అని వామనమూర్తి బలిచక్రవర్తికి వరం ఇచ్చారట. అందుకే ఈనాడు నెలరోజులు హరిదాసుగారు గ్రామాలలో ప్రజలను తరిపంచేయటానికి హరినామ సంకీర్తనం చేస్తూ తిరుగుతుంటారు. తలపై అక్షయపాత్ర ధరించి, ఆపాత్రవున్నంతవరకు ఎవ్వరితోనూ మాట్లాడరు. హరినామ సంకీర్తనలు చేస్తూనే వెళుతుంటారు. ఇదీ హరిదాసుల చరిత్ర.

ధనుర్మాసంలో సంపాదించిన ధాన్యం, డబ్బులతో సంవత్సరమంతయు గడచుట కష్టంగావున వీరిలో కొందరు మిగిలిన రోజులలో వేరే వృత్తులు అనగా సవరాలు అమ్ముట, సైకిల్‌పై ఊరు ఊరు తిరిగి బట్టలు అమ్ముటచేయుచున్నారు. శ్రీ రామదాసు, శ్రీ త్యాగరాజు, శ్రీ అన్నమయ్య కీర్తనలు పాడుకొనుచూ గ్రామాలలోని ప్రతిఇంటికి వెళ్ళుచుండుటవల్ల పండిత పామరులందరికీ ముఖ్యంగా చిన్నారులకు ఈ కీర్తనలపై ఆసక్తి కలిగి భక్తి భావం మరియు సన్మార్గము పెంపొందించుటకు ఎంతో ఉపయోగపడుతోంది.